

మాట్లాడుతున్న పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

## హామీలపై ప్రశ్నించాలి

పెద్దపల్లి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, ఏప్రిల్ 22: ఆచరణ సాధ్యంకాని హామీలు, మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నించాలని, ఎక్కడికక్కడ నిలదీయాలని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీల మోసంపై పోస్టు కార్డు ఉద్యమం చేపట్టామని, ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నిస్తూ సోమవారం 5వేల పోస్టులు ముఖ్యమంత్రికి పంపామని పేర్కొన్నారు. నేటి నుంచి పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్‌లోని గ్రామ గ్రామాన పోస్టు కార్డు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి, ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని మాటిచ్చి మోసం చేసిన రేవంత్ సర్కారును నిలదీయాలని సూచించారు. రైతు బంధు అందరికీ ఎందుకు ఇవ్వలేదో? రూ.2లక్షల రుణమాఫీ ఎందుకు చేయలేదో..? రేవంత్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు దేవుళ్లు కర్రు కాల్చి వాత పెడుతారన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని, గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గంట రాములు, బండారి స్రవంతి శ్రీనివాస్, దాసరి ఉష, రాజ్‌కుమార్, మార్కు లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిజామాబాద్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

## అబద్ధపు హామీలతో కాంగ్రెస్ మోసం

- నిజామాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సారంగాపూర్, ఏప్రిల్ 22 : రాష్ట్రంలో దొంగలు పడ్డ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఉన్నదని, ఆచరణ సాధ్యం కాని 420 హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసి గెలిచిందని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ఒక ఝూటాకోర్ అని ధ్వజమెత్తారు. తనను ఎంపీగా గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి పార్లమెంట్‌లో కొట్లాడుతానని హామీ ఇచ్చారు. సోమవారం సాయంత్రం సారంగాపూర్ మండలంలోని పెంబట్ల, కోనాపూర్, రేచపల్లి, బీర్‌పూర్ మండలంలోని తుంగూరు గ్రామాల్లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎన్నికల ఇన్‌చార్జ్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ కంటే డబుల్ పథకాలు ఇస్తామని చెప్పి ప్రజలను నమ్మించి మోసం చేసిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. ఆశతో కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోయామని ప్రజలు చెపుతున్నారని తెలిపారు. ఈసారి న్యాయం చేసే వారికే ఓటు వేయాలని సూచించారు. కేంద్రంలో అధికారంలో ఉన్నా అభివృద్ధికి నిధులు తీసుకురాలేని అసమర్థుడు ధర్మపురి అర్వింద్ అని ధ్వజమెత్తారు. బీజేపీ ప్రజల చెవిలో పువ్వు పెడితే, కాంగ్రెస్ ప్రజల నెత్తిన భస్మాసుర హస్తం పెట్టిందన్నారు. ఎన్నికల్లో గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ కాంగ్రెస్ అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజలు ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మోజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే కరువు వచ్చిందని, రానున్న రోజుల్లో మరింత తీవ్రం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా ఎంత ఉన్నదో ఇప్పటికే ప్రజలకు అర్థమైందన్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర పైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ రాజేంశంగౌడ్, జడ్పీటీసీ మేడిపెల్లి మనోహర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, పార్టీ మండలాధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, మండల యూత్ అధ్యక్షులు మధుకుమార్, నాయకులు సుధాకర్‌రావు, ఢిల్లీ రామారావు, మల్లేశం, లింగారెడ్డి, రవి, లింగరెడ్డి, మల్లేశం రమేశ్, మహేశ్ పాల్గొన్నారు.



మల్యాలలో రోడ్‌షోలో జై కొడుతున్న ప్రజలు

## అవకాశమివ్వండి ప్రజా గొంతుకనవుతా..

- పార్లమెంట్‌లో ఈ ప్రాంత సమస్యలపై ప్రశ్నిస్తా
- కేంద్రంలో ఏ ప్రభుత్వమున్నా నిధులు తెస్తా
- నియోజకవర్గవర్గ అభివృద్ధికి కృషి చేస్తా
- మార్పంటే వరదకాలువను ఎండిపోయేలా చేయడమా..? వడ్లను అగ్గువకు అమ్ముకునేలా చేయడమా..?
- కాంగ్రెస్‌కు ఓటేసి ప్రజలు గోసపడుతున్నరు
- బీజేపీకి ఓటేస్తే ఆగమైపోతరు
- మల్యాలలో రోడ్ షోలో బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మల్యాల, ఏప్రిల్ 22 : కరీంనగర్ ఎంపీగా తనను గెలిపిస్తే ప్రజాసమస్యలపై ప్రశ్నించే గొంతుకనవుతానని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. 2019లో చేసిన పొరపాటును మళ్లీ చేసి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, కేంద్రంలో ఏ ప్రభుత్వమున్నా నిధులు తీసుకొస్తానని హామీనిచ్చారు. కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో ప్రజలు గోస పడుతున్నారని, బీజేపీకి ఓటేస్తే ఆగమవుతారని హెచ్చరించారు. మార్పంటే 2203 రూపాయలు పలికే ధాన్యాన్ని రైతులు 1800 రూపాయలకు మిల్లర్లకు అమ్ముకునేలా చేయడమేనా..? చొప్పదండి నియోజకవర్గంలో జీవనదిలా ఉన్న వరదకాలువను ఎండబెట్టడమేనా..? అని ఎద్దేవా చేశారు. అసలు మార్పంటే అభివృద్ధిలో పోటీ పడాలని, కేంద్రంతో కొట్లాడి యువతకు సింగపూర్ తరహాలో శిక్షణనిచ్చే వృత్తి నైపుణ్య కేంద్రాలను నెలకొల్పాలని, హైదరాబాద్ నుంచి కరీంనగర్ రైలు మర్గాన్ని పూర్తి చేయాలన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని మల్యాలలో సోమవారం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ప్రజలకు చేసిందేమీ లేదని, కేవలం మతాల పేరిట యువతను రెచ్చగొట్టడం తప్పితే కనీసం ఐదు రూపాయల పని చేయలేదని విమర్శించారు. ఉపాధిహామీ కింద చేపట్టిన పనులను పల్లెల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయించానంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణకు 23 నవోదయ పాఠశాలలు రావాల్సి ఉంటే పదేళ్ల బీజేపీ పాలనలో ఒక్కటంటే ఒక్క నవోదయ పాఠశాల కూడా రాలేదని విమర్శించారు. నవోదయ పాఠశాల ఎందుకు తీసుకురాలేదని ఓట్లకోసం వచ్చే సంజయ్‌ని నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎంపీ పదవి ఏమైనా బండి కోసం తీసుకువచ్చారా..? ఎమ్మెల్యేగా ఓడిపోతే ఎంపీగా పోటీ చేసేందుకు కరీంనగర్ పునరావాసమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ వల్ల కరీంనగర్‌కు ఒరిగేదేమీ లేదన్నారు. మార్పు పేరిట ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని, కానీ, ఆ పార్టీ మార్పు పేరిట ప్రజలను వంచించిందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడానికేనా..? అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి విధానం వల్ల ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ కరీంగనర్ ఎంపీ అభ్యర్థిని తేల్చుకోలేకపోతున్నదని విమర్శించారు. ఎంపీ అంటే కేంద్రంతో కొట్లాడి తెలంగాణ నిధులు తేవాలని, ఇదంతా జరగాలంటే తెలంగాణపై అవగాహన ఉన్న నాయకుడు ఉండాలని చెప్పారు. ఉద్యమ సమయంలో తనకు తెలంగాణ అంతటా తిరిగిన అనుభవం ఉన్నదని, ప్రజాసమస్యలపై అవగాహన ఉన్నదని చెప్పారు. తనను కరీంనగర్ ఎంపీగా గెలిపిస్తే నిత్యం అందుబాటులో ఉంటానని, అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. తాను హిందువుని కాకపోతే కొండగట్టు ఆలయానికి ప్రభుత్వ భూమిని 333 ఎకరాలు ఎలా బదిలీ చేయిస్తానని చెప్పారు. ఈ విషయంలో కొంతమంది బీజేపీ నాయకులు ఏదేదో మాట్లాడుతున్నారని, ఈ కాగితాలే భూములను బదిలీ చేసిన విషయానికి రుజువులని స్పష్టం చేశారు. కావాలంటే వారికి సైతం కాగితాలు పంపిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి పన్యాల భూపతిరెడ్డి, డాక్టర్ అమిత్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు జనగం శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు కొండపలుకుల రాంమోహన్‌రావు, సుభాన్, ముత్యాల రాంలింగారెడ్డి, అయిల్నేని సాగర్‌రావు, బోయినిపల్లి మధుసుదన్‌రావు, నేల్ల రాజేశ్వర్‌రెడ్డి, తైదల శ్రీలతరెడ్డి, తిరుపతిరెడ్డి, సంపత్, అజహర్, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్, బీజేపీకి కర్రుకాల్చి వాత పెట్టాలి

తెలంగాణ ప్రాంత హక్కుల గురించి పార్లమెంట్‌లో గళమెత్తి ప్రశ్నించే గొంతుక కావాలి. కరీంగనర్ అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడు వినోద్‌కుమార్. ఎమ్మెల్యేగా నేను రాష్ట్రంలో, ఎంపీగా వినోద్ గెలిస్తే పార్లమెంట్‌లో పోరాడి నిధులు తెస్తం. మేమంతా ఐక్యంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేలా అడుగులు వేస్తం. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను మభ్యపెట్టింది. నాలుగు నెలల్లోనే కరువు తెచ్చింది. సాగునీరు, తాగునీరు లేక గోసపడుతున్నాం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టాలి.

- కరీంగనర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



సిరిసిల్ల పట్టణ క్లస్టర్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

## సమష్టిగా పని చేస్తే విజయం మనదే

- భవిష్యత్ మనదే.. భయం వద్దు
- మీకు ఎల్లవేళలా అండగా ఉంటా
- అక్రమ కేసులకు భయపడేది లేదు
- రెట్టింపు ఉత్సాహంతో పనిచేద్దాం
- కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగరేద్దాం
- వచ్చే నెల 10న సిరిసిల్లలో కేసీఆర్ రోడ్‌షోను సక్సెస్ చేయాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు కృషి చేస్తా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సిరిసిల్లలో కార్యకర్తలకు దిశానిర్దేశం

భవిష్యత్ మనదే. భయం వద్దు. కష్టకాలంలో నావెంట నిలిచిన మీకు ఎప్పుడూ అండగా ఉంటా. రెట్టింపు ఉత్సాహంతో పనిచేద్దాం. సమష్టిగా కష్టపడితే కరీంనగర్‌లో విజయం మనదే. పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేద్దాం. జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసే సత్తా ఉన్న నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. వచ్చే నెల 10న సిరిసిల్లలో నిర్వహించే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షోకు ప్రతి కార్యకర్త తరలిరావాలి. అన్ని చోట్ల నుంచి వచ్చి విజయవంతం చేయాలి.

- బీఆర్ఎస్ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకే విజయావకాశాలు మెండుగా ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రైతు సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీపై వ్యతిరేకతతో బీఆర్ఎస్‌కు 8 నుంచి 10 స్థానాలు వస్తాయంటూ పలు సర్వేలు చెబుతున్నాయని జోస్యం చెప్పారు. రెట్టింపు ఉత్సాహంతో కార్యకర్తలు పనిచేస్తే కరీంనగర్ సీటు మనదేనని చెప్పారు. వినోదన్న గెలిస్తే కరీంనగర్‌ను మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో పార్టీ జిల్లాధ్యక్షుడు తోట ఆగయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన పట్టణ క్లస్టర్ కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు సిరిసిల్లకు చేరుకున్న ఆయన రాత్రి వరకు వార్డుల వారీగా కార్యకర్తలతో చర్చించారు. పట్టణంలోని 39 వార్డులకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్లమెంట్ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో హంగు, ఆర్భాటాలకు దూరంగా ఉండాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో చాలా స్థానాల్లో స్వల్ప మెజార్టీ తేడాతో కాంగ్రెస్ విజయం సాధించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్, బీజేపీ చేసిన మోసాలపై గడపగడపకూ వెళ్లి ప్రజలతో చర్చించాలని సూచించారు. బలమైన ప్రతిపక్షంగా ఉన్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు ప్రజల పక్షాన ఉండి కొట్లాడుదామన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై వంద రోజుల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటు వేయక పోతే ఫ్రీబస్సు తీసేస్తామంటూ బెదిరిస్తున్నారని, దీనిపై ప్రజలు ఆలోచన చేస్తున్నారని చెప్పారు.

### ఐదేళ్లలో బండి చేసిందేంటి?

పార్లమెంటు ఎన్నికల్లో గెలిచిన బండి సంజయ్ కరీంనగర్‌కు ఏం చేశాడని కేటీఆర్ ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్కగుడి కట్టాడా..? ఒక్క బడి తెచ్చాడా..? పరిశ్రమలను తీసుకొచ్చాడా..? అంటూ ఫైర్ అయ్యారు. ఒక్క రూపాయి పనిచేయని బండికి ఓట్లు అడిగే అర్హత లేదని విమర్శించారు. పదేండ్ల మోదీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, ఫలితంగా సామాన్యుడు ఇబ్బందులు పడుతున్నాడని తెలిపారు. తెలంగాణకు ఏమీ చెయ్యని బీజేపీకి, కరీంనగర్‌కు నయాపైసా పనిచెయ్యని బండి సంజయ్‌కు ఓటు ఎందుకు వేయాలో ప్రజల్లో చర్చ పెట్టాలని కార్యకర్తలకు సూచించారు.

### అండగా ఉంటా..

కష్టకాలంలో తనవెంట నిలిచిన కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం కష్టపడతానని కేటీఆర్ చెప్పారు. పార్టీ కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటానన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్‌లో చేరాలని ఆ పార్టీ నాయకులు ఒత్తిడి తెస్తున్నారని, చేరని వారిపై అక్రమ కేసులు పెడుతూ వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. భవిష్యత్ మనదేనని, లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటితే పార్టీకి పూర్వవైభవం వస్తుందని చెప్పారు. మన నుంచి లబ్ధిపొందిన నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడుతున్నారని, వారి గురించి అంతగా ఆలోచించాల్సిన అవసరం లేదని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, బీఆర్ఎస్ నాయకులు చీటి నర్సింగారావు, టీఎస్‌టీపీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, నాయకులు బొల్లి రాంమోహన్, అన్ని వార్డుల కౌన్సిలర్లు, వార్డు కమిటీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.




ఈనెల 20న అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు పేరిట ప్రెస్‌రిలీజ్ ప్రకటనలు

## ..ఇంతకీ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరు?

- కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో గందరగోళం
- ఎంపీ టికెట్ కోసం ఇద్దరు ఆశావహుల పోటాపోటీ
- ఇద్దరు అభ్యర్థులను ప్రకటించినట్టుగా వేర్వేరుగా ప్రకటనలు
- మొదటి అభ్యర్థి ప్రకటన వచ్చిన గంటలోపే మరో అభ్యర్థి ప్రకటన
- ఏఐసీసీ ముద్ర, జనరల్ సెక్రటరీ సంతకాలతో ఫేక్ లెటర్లు
- సోమవారం నామినేషన్ వేసిన రాజేందర్‌రావు
- అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి సైతం దాఖలు చేసేందుకు ఏర్పాట్లు?
- అయోమయంలో హస్తం శ్రేణులు

కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో గందరగోళం తయారైంది. ఇప్పటివరకు పార్టీ అధిష్టానం ఏ అభ్యర్థిని అధికారికంగా ప్రకటించకున్నా.. ఎవరికి వారే తమకు టికెట్ వచ్చినట్టుగా చెప్పకోవడం.. ప్రెస్ రిలీజ్ పేరిట ప్రకటనలు బయటకు రావడం చర్చనీయాంశమవుతున్నది. మరో విచిత్రం ఏమిటంటే.. ఒక వ్యక్తి పేరుతో వచ్చిన గంటలోనే మరోవ్యక్తి పేరుతో అచ్చు గుద్దినట్లుగా ప్రకటన రావడం.. ఆ రెండింటిలోనూ ఏఐసీసీ ముద్రలు, జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ సంతకాలు ఉండడం శ్రేణులను అయోమయానికి గురి చేస్తున్నది. ఇప్పటి వరకు స్పష్టత లేకపోవడంతో ఇంతకీ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే ప్రశ్న తెరపైకి వస్తున్నది.

కరీంనగర్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆ పార్టీ నుంచి ఇద్దరు నాయకులు పోటీ పడుతున్నారు. అందులో ఒకరు మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి కాగా, మరొకరు మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు తనయుడు వెలిచాల రాజేందర్‌రావు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రవీణ్‌రెడ్డి హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించారు. ఎలాగూ టికెట్ తనకే వస్తుందన్న నమ్మకంతో ప్రచార రథాలు తయారు చేయించుకున్నారు. అలాగే, పోస్టర్లు, కరపత్రాలు సిద్ధం చేసుకున్నారు. అయితే అప్పుడు ఆ టికెట్‌ను పొన్నం ప్రభాకర్‌కు కేటాయించారు. ఆ సమయంలో భవిష్యత్‌లో మంచి అవకాశాలు కల్పిస్తామని పార్టీ అధిష్టానం చెప్పడంతో ప్రవీణ్ రెడ్డి పోటీ నుంచి తప్పుకున్నారు. తర్వాత ఎంపీ ఎన్నికలు రాగానే.. ముందుగా ప్రవీణ్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఎమ్మెల్యే ఎన్నికల్లో అన్యాయం జరిగింది కాబట్టి.. ఎంపీగా పోటీ చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే ప్రవీణ్‌రెడ్డికి చెప్పినట్లుగా ప్రచారం జరిగింది. ఆ మేరకు ఆయన ప్రిపేర్ అయ్యారు. ప్రచార రథాలు సిద్ధం చేసుకున్నారు. ఎంపీగా పోటీచేయడానికి కావాల్సిన పోస్టర్లు, అలాగే రికార్డింగ్‌లు, కరీంనగర్‌లో నివాసానికి, పార్టీ కార్యాలయం కోసం భవనాలు వంటివి మాట్లాడుకున్నారు. ఇక టికెట్ తనకే అన్న ధీమాతో ముందుకు కదిలారు. ఇక పేరు ప్రకటించడమే తరువాయి అన్నట్లుగా ప్రచారం జరిగింది. కానీ, ఇంతలోనే వెలిచాల రాజేందర్‌రావు పేరు తెరపైకి వచ్చింది. 2009లో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రజారాజ్యం నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. అయితే ప్రస్తుతం రాజేందర్‌రావును తెరపైకి తేవడంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చక్రం తిప్పినట్లుగా వార్తలు వచ్చాయి. అంతేకాదు, ప్రవీణ్‌రెడ్డి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయకుండా.. పొన్నం వెనకుండి కథ నడిపించారన్న విమర్శలు వచ్చాయి. రాజేందర్‌రావు పేరును ఆయన బలంగా ప్రతిపాదించినట్లుగా తెలిసింది.

### తేల్చని అధిష్టానం.. అయినా ప్రకటనలు

కరీంనగర్ పార్లమెంట్ నుంచి ఆ ఇద్దరు పోటీ పడుతున్నా.. అధిష్టానం మాత్రం ఇప్పటివరకు ఎవరినీ అధికారికంగా ప్రకటించలేదు. కానీ, కరీంనగర్ అభ్యర్థిగా అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పేరును కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించినట్లు తాజాగా, ముందుగాల ప్రెస్ రిలీజ్ పేరిట ఒక ప్రకటన బయటకు వచ్చింది. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ న్యూఢిల్లీ పేరిట ఉన్న ముద్రతోపాటు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ సంతకంతో ఆ లేఖ బయటకు వచ్చింది. సంతకం చివరన 10 ఏప్రిల్ 2024 అని ఉన్నది. పాత తేదీలున్నాయని అనుమాన పడుతున్న నేపథ్యంలో.. ఒక గంట తర్వాత 20 ఏప్రిల్ 2024 పేరుతో ప్రవీణ్‌రెడ్డి పేరును ప్రకటిస్తున్నట్లుగా మరో ప్రకటన బయటకు వచ్చింది. దీంతో ప్రవీణ్‌రెడ్డికే టికెట్ వచ్చిందని పార్టీ శ్రేణులు భావిస్తున్న తరుణంలో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావును ప్రకటించినట్లుగా మరో ప్రకటన వెలువడింది. ఇది కూడా అవే ముద్రలు, అవే సంతకాలతోపాటు 20 ఏప్రిల్ 2024న విడుదల చేసినట్లుగా ఉన్నది. దీంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముందుగా గందరగోళానికి గురయ్యారు. తర్వాత ఈ ప్రకటనలు బోగస్ అని తెలుసుకొని కొంత ఊపిరి పీల్చుకున్నారు. పార్టీలోనే ఎవరో కొంత మంది నాయకులు ఏఐసీసీ ముద్రలు, కేసీ వేణుగోపాల్ సంతకాలతో ఇలా ఫేక్ లెటర్లు సృష్టించారన్న విషయం స్పష్టమవుతున్నది.

### ఎవరిని వరిస్తుందో?

కరీంనగర్‌లో ఇద్దరు టికెట్ ఆశిస్తున్న నేపథ్యంలో వారిని కూర్చోబెట్టి.. ఎవరికో ఒకరికి టికెట్ ఇవ్వొచ్చు. కానీ, అధిష్టానం మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లుగా కనిపించడం లేదు. అభ్యర్థి పేరు ప్రకటించడంలో తీవ్ర జాప్యం జరుగుతుండగా, ఆ పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొన్నది. కాగా, సోమవారం వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్ దాఖలు చేశారు. నిజానికి అభ్యర్థి పేరు అధికారికంగా ప్రకటించకుండానే.. ఎలా నామినేషన్ దాఖలు చేస్తారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అంతేకాదు, నామినేషన్ కార్యక్రమంలో రాజేందర్‌రావు వెంట మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారు. పార్టీ అధికారికంగా అభ్యర్థి పేరు ప్రకటించకుండానే మంత్రి, ఎమ్మెల్యేలు ఎలా పాల్గొంటారని పార్టీలో అంతర్గత చర్చ నడుస్తున్నది. ఇదిలా ఉండగా.. ఇటీవల హుస్నాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశానికి ప్రవీణ్‌రెడ్డి హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. మరోవైపు ఆయన వర్గీయులు ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తుండగా, ఈ నెల 24న ఆయన నామినేషన్ వేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్టు విశ్వసనీయ సమాచారం. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా మోసం చేస్తే.. ఊరుకునేది లేదన్న సంకేతాన్ని ప్రవీణ్‌రెడ్డి, ఆయన వర్గీయులు ఇచ్చినట్లుగా తెలుస్తున్నది. అధిష్టానానికి కూడా ఇదే అల్టిమేటం పంపారని సమాచారం.


